హెచ్‌సీయూకి నూతన అధ్యక్ష, కార్యదర్శుల నియామకం

ఏబీవీపీ అధ్యక్షుడిగా బాలకృష్ణ, కార్యదర్శిగా సాక్షి


బాలకృష్ణ


సాక్షి

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నూతన అధ్యక్ష, కార్యదర్శిని నియమించారు. ఏబీవీపీ నేషనల్ జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా బాలకృష్ణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా కరుణాకర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రావుల కృష్ణయ్య సమక్షంలో వీరిద్దరిని ఎంపిక చేశారు. ఏబీవీపీ నూతన అధ్యక్షుడు బాలకృష్ణ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజంలో పరిశోధక విద్యార్థిగా ఉన్నారు. రెండు పోస్టుల్లోనూ పరిశోధక విద్యార్థులకు అవకాశం కల్పించడం విశేషం. వీరిద్దరిని హెచ్‌సీయూ క్యాంపస్‌లోని ఏబీవీపీ నాయకులు, సభ్యులు, విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ, సాక్షి మాట్లాడుతూ.. హెచ్‌సీయూలో సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. క్యాంపస్‌లోని విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అవకాశం కల్పించిన వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా చిత్తశుద్ధితో పనిచేస్తామని స్పష్టం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్


ప్రేమ్‌నగర్ బస్తీలో పర్యటిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

హఫీజ్‌పేట్: ప్రజా సమస్యలను పరిష్కరించడమే మొదటి కర్తవ్యమని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్‌లో కాలనీలో నెలకొన్న సమస్యలపై ఆయన పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజవర్గంలో ప్రతిబస్తీ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బస్తీలలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు అన్ని విధాలుగా అందేలా చూస్తామన్నారు. దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మన్నెపల్లి సాంబశివరావు, కృష్ణగౌడ్, కృష్ణయాదవ్, రహీం, సంగారెడ్డి, సాజిద్, రజక, అమీనుద్దిన్, మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు


ముగ్గుల పోటీదారులతో కార్పొరేటర్ హమీద్‌పటేల్


చందానగర్ సర్కిల్ - 21 ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీలో పోటీల్లో పాల్గొన్న మహిళలు

హఫీజ్‌పేట్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని చందానగర్ సర్కిల్ - 21 పరిధిలోని బాలాజీ నిర్మల్ రత్నా అపార్ట్‌మెంట్స్, ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, పీఏనగర్‌లలో మహిళలకు ముగ్గుల పోటీలు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి యాదవులు మాట్లాడుతూ.. ఆరోగ్యం, పారిశుద్ధ్యం, విజ్ఞానాన్ని మేళవించే సనాతన సాంప్రదాయమే ఇంటి ముందు ముగ్గులు వేయడమన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రపరిచి, గోమయంతో కలాపి చల్లి, బియ్యపుపిండితో రకరకాల రంగవల్లులను కళాత్మకంగా మహిళలు తీర్చిదిద్దుతారన్నారు. ధనుర్మాసంలో బియ్యపుపిండి తినేందుకు చీమలుచేరి క్రిమి కీటకాలను లోపలికి రాకుండా కాపాడతాయన్నారు. గోమయం వాసన వలన కూడా విషపూరితమైన కీటకాలు ఇంటి పరిసరాల్లోకి రావన్నారు. దీంతో పరిసరాలు పరిశుభ్రంగా ఉండటమే కాకుండా మానవులు ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. ముగ్గులు వేసే ప్రక్రియలో మహిళలకు జరిగే వ్యాయామంతో అనేక గర్భకోశ వ్యాధులు రాకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని, వైద్య నివేదికలు చెబుతున్నాయన్నారు. పట్టణీకరణ నేపథ్యంలో అపార్టుమెంట్ కల్చర్ బాగా పెరిగిన తర్వాత మన ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలు భవిష్యత్ తరానికి అందించడానికి, మహిళలలో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. చంద్రకళ, భీమమ్మ, శ్రీదేవి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మల్లేష్, రామారావు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం..

గచ్చిబౌలి: సంక్రాంతి పర్వదినం సందర్భంగా కొండాపూర్ డివిజన్ కొత్తగూడలోని కమ్యూనిటీహాల్ ప్రాంగణంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్ చేతుల మీదుగా బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి అనగానే అందరికీ గుర్తొచ్చేవి ముగ్గులు, గాలిపటాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. స్థానికులు కేశం పుణ్యవతి, రఫియాబేగం, సంగీత, సునీత, షాహిజా, లక్ష్మమ్మ, రమాదేవి, రేవతి, లక్ష్మమ్మ, సుజాత, లావణ్య, పూజిత, సునీత, సరిత, మమత, శ్వేత, మాధవి, రాము, కుమార్, లక్ష్మణ్, ఖాసీమ్, యాదగిరి, శ్రీను, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్‌తో పేదలకు భరోసా


మంజూరు పత్రాలను బాధితులకు అందజేస్తున్న దృశ్యం

గచ్చిబౌలి: సీఎం సహాయనిధి పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భరోసాను ఇస్తుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. మియాపూర్‌కు చెందిన రాజేష్‌కుమార్‌కు రూ.లక్ష , అంజయ్యనగర్‌కు చెందిన హుస్సేనమ్మకు రూ.లక్ష సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ మంజూరు పత్రాలను శనివారం ఆయన అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి నిరంతరం ప్రజలకు సేవలను అందిస్తూ.. ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందన్నారు. అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు అండగా నిలుస్తోందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ సీఎంఆర్‌ఎఫ్ అందిస్తామన్నారు. మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు మహ్మద్‌ఖాజా తదితరులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- క్రికెట్ పోటీలు ప్రారంభం

పటాన్‌చెరు: మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో నిర్వహించనున్న రుద్రారం ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించడంతో పాటు క్రీడారంగ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుధీర్‌రెడ్డి, ఎంపీటీసీలు మన్నె రాజు, హరిప్రసాద్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు పాండు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు టీషర్ట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

కృషినగర్ వద్ద ప్రధాన రోడ్డును తవ్వి వదిలేసిన దృశ్యం



నత్తనడకన అభివృద్ధి పనులు

- అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, స్థానిక ప్రజలు

మియాపూర్: అభివృద్ధి పనుల్లో అలసత్వం ప్రజల పాలిట శాపంగా మారింది. సకాలంలో పూర్తి చేయాల్సిన అభివృద్ధి పనుల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి పనులు నెలల తరబడి పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

- మియాపూర్‌లోని కృషినగర్‌కాలనీలో ప్రధాన రహదారిని తవ్వి అండర్ డ్రైనేజీ పనులను చేపట్టారు.
- ఈ పనులను చేపట్టి సుమారు ఐదు నెలలు గడుస్తున్న పనులు పూర్తికాకపోవడంపై స్థానికులు తీవ్ర ఇబ్బంది పడతున్నారు.
- సందానగర్, మదీనాగూడ, బొల్లారం, బాచుపల్లి, మక్తమహబూబ్‌పేట, జేపీఎన్ నగర్, ప్రశాంత్‌నగర్, స్వర్ణపూరి కాలనీ, అమీన్‌పూర్ కాలనీలకు వెళ్లే వాహనదారులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు.
- కృషినగర్ కాలనీ ప్రధాన రోడ్డు పక్కన కొంతదూరం రోడ్డును తవ్వి నెలల తరబడి పనులను కొనసాగుతుండటంతో ఆ ప్రదేశంలో రోడ్డు ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆ రోడ్డు వెంబడి ఉదయం, సాయంత్రం వేళల్లో గంటల తరబడి వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.
- దీనిపై అధికారులు స్పందించి పనులను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మంచి ఆలోచనలతో కొత్త మార్గంలో పయనించాలి

ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ



గచ్చిబౌలి: పనికిరాని చెత్త ఆలోచనలకు స్వస్తి పలికి, కొత్త మార్గంలో పయనించాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ ప్రజలందరికీ సూచించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మూడ్రోజుల పాటు భోగి, మకరసంక్రాంతి, కనుమ పండుగలుగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. దక్షిణాయనం నుంచి ఉత్తరాయణం ప్రారంభమవడంతో వచ్చే మార్పులను ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలంతా ఆనందోత్సాహాల మధ్య మూడు రోజుల పండుగను జరుపుకోవాలని కోరారు.

అలరించిన వీణాగానం



అలరించిన సంగీత కచేరీ, వీణాగానం

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో అన్నమాస్వరార్చన వీణాగానం సందర్శకులను ఆకట్టుకుంది. శనివారం జయంతి గాత్ర కచేరి, వీణాగాన ప్రదర్శన అలరించింది. సుష్మ వేద శిష్యబృందంచే అన్నమయ్య సంకీర్తనలకు మృదంగం అనీష్ వాయిద్య సహకారం అందించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ శోభారాజు జ్ఞాపికలతో కళాకారులను సత్కరించారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... రూ.టమాట 25, పచ్చిమిర్చి రూ.55-60, బెండకాయ రూ.55, కాకరకాయ రూ.60, దొండకాయ రూ.50, దోసకాయ రూ.50, ఆలుగడ్డ 25, చామగడ్డ 60, కీర 25, బీరకాయ 60, వంకాయ 40, గోకర 60, బీన్స్ 50, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 25, క్యారెట్ 60, చిక్కుడు రూ.50, ఉల్లిగడ్డ రూ.40 (1 కేజీ), ములక్కాయలు (3) 20 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) రూ.20, అల్లం రూ.250, వెల్లుల్లి రూ.250గా ఉన్నాయి.

గీతం స్కాలర్ వసుధకు డాక్టరేట్



పటాన్‌చెరు: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధక విద్యార్థి వసుధను డాక్టరేట్ వరించింది. హైదరాబాద్ (తెలంగాణ)లోని ఐటీ సంస్థల్లో సంస్థ సుస్థిరతపై పర్యావరణ హిత మానవ వనరుల నిర్వహణ (జీహెచ్‌ఎర్ఎం) అభ్యాసాల ప్రభావంపై అధ్యయనం చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించిన ఈ పరిశోధనకు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పార్వతి మార్గదర్శనం వహించింది. వసుధ సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం అదనపు ప్రొఫెసర్ డీఎస్ రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ప్రత్యేక అభినందన

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎన్ఎస్‌ఎస్ సెల్ వాలంటీర్ అభిలాష్‌ను వాలంటీర్లు, ఎన్ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అభినందించారు. నెహ్రూ యువ కేంద్రం రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో పలు పోటీల్లో అభిలాష్ పాల్గొని రెండోస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వాలంటీర్లు, కో- ఆర్డినేటర్ డాక్టర్ కృష్ణయ్య, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ భీమ్‌సింగ్‌లు అభినందించారు. వారు మాట్లాడుతూ.. సమాజ సేవలో ఎన్ఎస్‌ఎస్ ఎప్పుడూ ముందుంటుందని వివరించారు. వివిధ రకాలలో పోటీలలో పాల్గొని జిల్లా స్థాయిలో అభిలాష్ ఎన్ఎస్‌ఎస్ వాలంటీర్‌గా తన సత్తాచాటారని గుర్తు చేశారు. వాలంటీర్లు అందరూ భవిష్యత్తులో జరిగే అన్ని పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. హెచ్‌సీయూలోని విద్యార్థులు, ఉద్యోగులంతా ఎన్ఎస్‌ఎస్ చేపట్టే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వాలంటీర్లు రసజ్ఞ, వెంకట్‌దాస్, మహ్మద్ జునైద్, అభి లాష్, యోగేందర్ వాలంటీర్లు పాల్గొన్నారు.



రాముల వారి అక్షింతల పంపిణీ



బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మాపేల్ టౌన్‌షిప్‌లో పవిత్ర అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలను గణపతి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అర్చకులు, టౌన్‌షిప్ వాసులు చర్ల గోపాల్‌రెడ్డి, భల్లా మల్లేష్, సుధాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు శ్రీ రాముల వారి అక్షింతలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటి సభ్యులు అక్షింతలకు హారతులు ఇచ్చి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి, వినయ తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా తోడేస్తున్నారు!


జిన్నారంలోని ప్రభుత్వ భూమిలో చేపట్టిన మట్టి తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంత

- రాత్రీపగలు తేడాలేకుండా మట్టి తవ్వకాలు
- ప్రభుత్వ భూములనూ వదలని అక్రమార్కులు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): కొందరు అక్రమార్కులు గుట్టలు, ప్రభుత్వ భూములను వదలడం లేదు. అనుమతులు లేకుండా యథేచ్ఛగా మట్టిని తవ్వుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

జిన్నారం మండల వ్యాప్తంగా నెల రోజుల నుంచి భారీగా మట్టి అక్రమ రవాణా జరుగుతోంది. మండలంలోని మాదారం, కొండకంచి, రాళ్లకత్వ గ్రామాల్లో మట్టిని తోడుతూ శివానగర్‌లోని పలు పరిశ్రమలకు తరలిస్తున్నారు. కొడకంచి గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులే మట్టి మాఫియాగా మారి ఈ దందాను నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మంత్రికుంట గ్రామంలో కూడా కొందరు నాయకులు మట్టిని తరలించారు. జిన్నారంలోని 1002 సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమి నుంచి వారం రోజుల పాటు మట్టిని నిబంధనలకు విరుద్ధంగా తరలించారు. దానిని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలు నిర్మాణానికి తరలించినట్లు తెలిసింది. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతోనే ఈ మట్టి దందా జరుగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

> **కేసులు నమోదు చేస్తున్నాం**
>
> మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. రవాణాను గ్రామాల ప్రజలు అడ్డుకోవాలి. తమ దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నాం. - మల్లికార్జున్, డిప్యూటీ తహసీల్దార్ జిన్నారం

చైనా మాంజాను వినియోగించొద్దు


గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు

గచ్చిబౌలి: సంక్రాంతి పర్వదినం సందర్భంగా గాలిపటాలను ఎగురవేయడానికి చైనీస్ మాంజాను ఉపయోగించొద్దని గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు శనివారం ప్రజలను కోరారు. ప్రభుత్వం చైనీస్ మాంజా (థ్రెడ్)ను ఉపయోగించొద్దని దీన్ని నిషేధించిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇది నాన్ బయోడిగ్రేడబుల్ అని, దీనితో పర్యావరణం, ప్రకృతిని కలుషితం చేస్తుందన్నారు. ఈ మాంజా సాంప్రదాయంలో ఉపయోగించే పత్తి కంటే సింథటిక్ పదార్థంతో తయారు చేస్తారని ఆయన పేర్కొన్నారు. దీని వినియోగం ద్వారా మనుషులకేకాకుండా పక్షులు, జంతువులకు కూడా తగిలితే అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని, ఊహించని సంఘటనలు కూడా చోటు చేసుకుంటాయన్నారు. దీన్ని చేతులతో కత్తిరించడం కూడా ఎంతో కష్టమని, దీని ద్వారా చేతులకు కూడా గాయాలయ్యే ప్రమాదం ఉంటుందన్నారు. అందుకే ప్రభుత్వం నిషేధించిన చైనీస్ మాంజాను గాలిపటాలను ఎగురవేయడంలో ఎట్టి పరిస్థితుల్లో వినియోగించకూడదని ఆయన స్పష్టం చేశారు. సంక్రాంతి పర్వదినాన్ని కుటుంబంతో సంతోషంగా నిర్వహించుకోవాలని సాంప్రదాయబద్ధమైన వాటిని వినియోగించే పర్యావరణ, ప్రకృతి పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు.

కంకర క్రషర్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి



జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండల పరిధిలోని మాదారం గ్రామ శివారులోని కంకర క్రషర్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కంకర క్రషర్ ఎదుట రైతులు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత, మాజీ వార్డుసభ్యుడు రాజుగౌడ్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా కంకర క్రషర్‌ల యాజమాన్యాలు బ్లాస్టింగ్ చేపడుతుండటంతో సమీపంలోని పంట పొలాలపై దుమ్ముధూళి పేరుకుపోయి పంటలు పండటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అనుమతులు లేకున్నా కంకర క్రషర్‌ల యాజమాన్యాలు బ్లాస్టింగ్‌లు చేపడుతున్నాయని మండిపడ్డారు. ఈ విషయమై అధికారులు స్పందించి కంకర క్రషర్ యాజమన్యాలపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అక్రమ కట్టడాలను తొలగిస్తాం

పటాన్‌చెరు టౌన్: డ్రైనేజీ లైన్‌లపై నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగిస్తామని కార్పొరేటర్ కుమార్‌యాదవ్ అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మార్క్‌నగర్ కాలనీలోని డ్రైనేజీ వ్యవస్థను శనివారం పరిశీలించారు. డ్రైనేజీ లైన్‌పైన నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగిస్తామన్నారు. అనంతరం శాంతినగర్‌లోని జాతీయ రహదారి పక్కన బజాజ్ షోరూమ్ ముందు ఉన్న డ్రైనేజీ లైన్ చెత్తతో నిండి ఉండటంతో గుర్తించిన కార్పొరేటర్ జెసీబీని పిలిపించి చెత్తను తొలగింపజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఊరుకు వెళ్తే సమాచారం ఇవ్వండి

పటాన్‌చెరు: సంక్రాంతి పండుగ నేపథ్యంలో సొంత ఊర్లకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని, విలువైన వస్తువులు మీ వెంటగాని, బ్యాంకుల్లో గాని భద్రపరచాలని పటాన్‌చెరు క్రైమ్ సీఐ శ్రీనివాస్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సొంత ఊర్లకు వెళ్లేవారు తమ ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలను ఆఫ్ చేయకూడదని, ఇంటి పక్కనే ఉండేవారికి తమ ఇంటి వైపు అప్పుడప్పుడు చూస్తూ ఉండాలని చెప్పి వెళ్లాలని సూచించారు. కాలనీలలో కొత్త వ్యక్తులు ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే డయల్ 100కు కాల్ చేయాలని లేదా స్థానికంగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సిద్ధివినాయక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కౌన్సిలర్ చంద్రారెడ్డితో పాటు బీఆర్‌ఎస్ నాయకురాలు ప్రత్యూష హాజరై మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీన్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

పటాన్‌చెరు సీఐ సస్పెన్షన్

పటాన్‌చెరు టౌన్: హత్య కేసు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు పటాన్‌చెరు సీఐ లాలునాయక్‌ను పోలీసు ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఇటీవల అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లారీ యజమాని బీరంగూడ మల్లారెడ్డి కాలనీకి చెందిన నాగేశ్వరరావు అదృశ్యం కావడంతో అతడి భార్య పద్మ ఫిర్యాదుతో అమీన్‌పూర్ పోలీసులు ఈ నెల 22న అదృశ్యం కేసుగా నమోదు చేశారు. అయితే శంకర్ అనే నిందితుడు నాగేశ్వర్‌రావును కొట్టి సాకిచెరువు కట్టపై పడేశాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో వైద్యుల పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే ఈ ఘటనపై పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ నుంచి నిర్లక్ష్యంగా స్పందించడంతో సీఐ లాలూనాయక్‌ను పోలీసు ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. పటాన్‌చెరు క్రైమ్ సీఐ శ్రీనివాసరెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పారు.

ఆకుల హనుమంతరావుకు నివాళి

లంగర్‌హౌస్: నిస్వార్థంగా పార్టీ కోసం పని చేస్తు తనతో పాటు మరెందరికో దారి చూపిన గొప్ప వ్యక్తి ఆకుల హనుమంతరావు అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. జనసంఘ్, బీజేపీ సీనియర్ నాయకులు ఆకుల హనుమంతరావు మృతికి సంతాపం తెలియజేస్తూ ఆయన దినకర్మ కార్యక్రమానికి కిషన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులతో కలిసి తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అశోక్‌యాదవ్, శంకర్‌యాదవ్, గౌతంజీ, ఉదయ్‌కుమార్, ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

మిక్సికా టెక్నాలజీస్‌తో సీబీఐటీ ఒప్పందం

మణికొండ: ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధనలలో సహకారం, నూతన ఆవిష్కరణలు, ఇంక్యుబేషన్ మార్కెటింగ్, హ్యాకథాన్స్, కార్పొరేట్ ఇన్నోవేషన్, ఇతర శిక్షణ కార్యక్రమాలను అందించేందుకు మిక్సికా టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) ఒప్పందం చేసుకుంది. శనివారం కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు మాట్లాడుతూ అకాడెమియా, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించటం, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంలో ఆవిష్కరణ, విజ్ఞాన మార్పిడిని ప్రోత్సహించడం ఈ భాగసామ్యం లక్ష్యం అన్నారు. అతిథి ఉపన్యాసాలు, వర్క్‌షాప్‌లు మిక్సికా సంస్థ ప్రతినిధులు కళాశాలలో నిర్వహిస్తారన్నారు. కళాశాల ప్రాంగణంలో ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసే అవకాశానికి ఈ సహకారం తోడ్పడుతుందన్నారు. సాఫ్ట్‌వేర్ పరిశ్రమలో వ్యవస్థాపక ఆకాంక్షలతో విద్యార్థులు, అధ్యాపకులకు వనరులు, మార్గదర్శకత్వం అందించటం, ఆవిష్కరణలకు ఉపయోగపడుతుందన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225455
9912225462